యూరియా పక్కదారి..!

◆ కర్నాటకకు తరలింపు ◆ రైతులకు అందక ఇబ్బందులు

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

వర్షాలు రావడంతో పంటల సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ సమయంలో యూరియా కొరత రైతులను వేధిస్తోంది. అమ్మకం కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. వ్యవసాయ శాఖ అంచనాల కంటే అధికంగా కేటాయింపులు జరిగినట్టు రికార్డులు చెబుతున్నాయి. అయితే రైతులకు మాత్రం పూర్తి స్థాయిలో యూరియా అందుబాటులో లేదు. వర్షాలు ఆలస్యంగా వచ్చి పంటలు సాగు చేసుకుందామన్న రైతుకు యూరియా సమస్య వచ్చిపడింది.

పక్క రాష్ట్రం తరలుతోందా..?

పంటల సాగులో యూరియా కీలకమైనది. వరి, అరటి, మిరప , మొక్కజొన్న తదితర పంటలకు యూరియా ఎక్కువగా అవసరం అవుతుంది. యూరియా ఇప్పుడు పక్క రాష్ట్రం కర్నాటకకు తరలిపోతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీని మూలంగానూ సమస్య వస్తున్నట్లు తెలుస్తోంది. కర్నాటక రాష్ట్రంలో యూరియా ధర ఆంధ్రప్రదేశ్‌లో కంటే ఎక్కువగా ఉంది. ఇక్కడ బస్తా రూ.267 ఉండగా, కర్నాటకలో రూ.560 ఉంది. ఈ భారీ వ్యత్యాసం ఉండటంతో ఇక్కడి నుంచి బ్లాక్ మార్కెట్‌లో కర్నాటకు తరలిపోతున్నట్టు ఆరోపణలున్నాయి. ఈ మేరకు అధికారుల తనిఖీల్లోనూ పట్టుబడటం గమనార్హం. రాయదుర్గంలో ఈ రకంగా అధికారుల తనిఖీల్లో పెద్దఎత్తున యూరియా అక్రమంగా తరలిస్తున్నది పట్టుబడినట్టు సమాచారం. ఇక గార్లదిన్నె మండలంలో ఒక కేంద్రంలో అధికారులు తనిఖీలు నిర్వహించగా స్టాకులో షార్టేజీ ఉన్నట్టు గుర్తించారు. ఇదంతా బ్లాక్ మార్కెట్‌లో పక్క రాష్ట్రంకు తరలిపోయినట్టు తెలుస్తోంది.

నియంత్రణకు అధికారులతో కమిటీ

యూరియా సమస్య తీవ్రమవుతుండటంతో జిల్లా ఉన్నతాధికారులు నియంత్రణకు ఇప్పుడు చర్యలు ఆరంభించారు. ప్రత్యేకంగా అధికారులతో తనిఖీకి బృందాలను ఏర్పాటు చేశారు. అదే విధంగా నిర్వహణలో ఇబ్బందుల్లేకుండా చూసేందుకు కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాకు వస్తున్న ఎరువులు, పంపిణీపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోనున్నారు.

కొరత లేకుండా చర్యలు

ఎరువుల కొరత లేకుండా రైతులకు సక్రమంగా అందించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నాం. ఈ వారంలో అదనంగా వెయ్యి మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానుంది. వచ్చిన యూరియా పక్కదోవ పట్టకుండా ఉండే విధంగా అధికారులతో కమిటీని నియమించాం. నిర్వహణలో ఎక్కడా సమస్యలేకుండా చేస్తాం.

ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయాధికారి.



"ఈ ఫొటోలో కన్పిస్తున్న మహిళ పేరు పుల్లమ్మ. ధర్మవరం మండలం ఓబుళనాయనపల్లి గ్రామం. మంచానికే పరిమితం అయిన ఈమె చాలా ఏళ్ల నుంచి వికలాంగ పింఛను తీసుకుంటోంది. ఇటీవల సర్వే పేరుతో ఈమెకు పింఛను రాదంటూ అధికారులు నోటీసులు ఇచ్చారు. దీంతో ఆమె తనకు పింఛన్ పునరుద్ధరించండి సార్.. అంటూ ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులను వేడుకుంది".

"రాప్తాడు మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన హర్షిత పుట్టుకతోనే వికలాంగురాలు. చేతులు, కాళ్లు పనిచేయక మంచానికే పరిమితం అయ్యింది. మాటలు కూడా రావు. ఈమెకు 2015లో 100 శాతం వికలత్వం సర్టిఫికెట్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో కూడా రూ.15 వేల పింఛన్ అందింది. జనవరిలో నిర్వహించిన ప్రత్యేక సర్వేలో హర్షిత వందశాతం వికలత్వాన్ని 50 శాతానికి తగ్గించి అధికారులు సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో ఆమె పింఛన్‌ను రూ.6వేలకు తగ్గించారు".

భరోసాకు బ్రేక్..!

◆ వికలాంగులకు 'కూటమి' షాక్

◆ పరిశీలన పేరుతో పింఛన్ల తొలగింపు

◆ నోటీసులు రావడంతో కార్యాలయం వద్దకు పరుగులు

◆ మళ్లీ దరఖాస్తు చేసుకోవాలంటూ అధికారుల ఉచిత సలహా

ఆర్థిక భరోసాగా ఉన్న పింఛన్లపై కూటమి ప్రభుత్వం కన్ను పడింది. పర్సంటేజీల పేరుతో వికలాంగుల పింఛన్లు తొలగిస్తూ వారికి షాక్‌ను ఇచ్చింది. ఇన్నాళ్లు అందుతున్న పింఛన్లకు బ్రేకులు వేస్తూ వికలాంగుల నడివిరిచింది. ఒక చేత్తో పింఛను సొమ్ము పెంచామని పెద్దగా చెప్పి మరో చేత్తో ఉన్న పింఛన్‌ను పూర్తిగా లాగేసుకుంది. పర్సంటేజీల పేరుతో పింఛన్‌ను తొలగిస్తూ నోటీసులు అందించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజులుగా నోటీసులు అందుకున్న వికలాంగులు సచివాలయాలు, ఎంపిడిఒ, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అర్హులుంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అక్కడి అధికారులు చావుకబురు చల్లగా చెబుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వికలాంగుల కుటుంబాలను తీవ్ర కలవరపాటుకు గురి చేస్తోంది.

ప్రజాశక్తి - చిలమత్తూరు, ధర్మవరం రూరల్

ఇటీవల కూటమి ప్రభుత్వం వికలాంగత్వం ఎంత ఉందో వైద్యులతో ధవీకరించి పర్సంటేజీతో సర్టిఫికెట్‌ను తీసుకు రావాలని కొత్త నిబంధనలను ప్రవేశపెట్టింది. గత 20 ఏళ్లుగా పింఛను తీసుకుంటున్న వికలాంగులు సైతం మళ్లీ సదరం సర్టిఫికెట్లు కోసం సచివాలయాలు, ఆస్పత్రు లకు పరుగులు పెట్టారు. రెండు, మూడు వారాలు ముందే సచివాలయంలోని సదరం లాగిన్‌లో తమ పేరు బుక్ చేసుకుని వైద్యుని వద్దకు వెళ్లి మరోసారి తాను ఎంత అంగ వైకల్యంతో ఉన్నానో నిర్ధారించి ధ్రువపత్రం ఇవ్వాలని కోరారు. ఇక్కడే అసలు కథ మొదలైంది. ప్రభుత్వం చెప్పిన విధంగా కోతకు సిద్ధంగా ఉన్న వైద్యులు ప్రతి వికలాంగుడికీ వైకల్య శాతం తగ్గించి ధ్రువపత్రాలు ఇచ్చారు. ఇప్పుడు వైకల్యం శాతం 40 కంటే తగ్గిందన్న సాకుతో చాలా మంది పింఛన్లను తొలగిస్తున్నారు. దీంతో వికలాంగులు లబోదిబోమంటున్నారు. ఏం చేయాలో తెలియక మళ్లీ సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

40 శాతం కంటే తక్కువ వికలత్వం ఉన్న వారికి సెప్టెంబర్‌లో పింఛన్లు ఇవ్వమని ఇప్పటికే సచివాలయాల ద్వారా సమాచారం ఇచ్చారు. పింఛన్ అందని వారి జాబితాను సైతం సచివాలయాల వద్ద అతికించారు. గత 20 ఏళ్లుగా ఇస్తున్న పింఛను ఇప్పుడు ఎందుకు ఇవ్వరని పలువురు వికలాంగులు అధికారులను ప్రశ్నిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. రూ.200 పింఛను ఇచ్చే సమయం నుంచి తీసుకున్న వికలాంగులు ఇప్పుడు అనర్హులుగా జాబితాలో పేర్లు రావడంతో లబోదిబోమంటున్నారు. అప్పుడున్న వికలత్వం ఇప్పుడెలా తగ్గుతుందంటూ ప్రశ్నిస్తున్నారు.

పింఛన్ల తొలగింపు దుర్మార్గం

అర్హులైన వికలాంగుల పింఛన్లను సర్వే పేరుతో తొలగించడం అన్యాయం. ఏళ్ల తరబడి వికలాంగుల పింఛన్ తీసుకున్న వారు ఇప్పుడెలా అనర్హులవుతారు. ప్రభుత్వం పింఛన్లలో కోత విధించేందుకు అనవసర నిబంధనలను తీసుకుని వచ్చింది. అనర్హుల ఏరివేత పేరుతో అర్హులకు అన్యాయం చేస్తున్నారు. అధికారులు కూడా కార్యాలయాల్లో ఉంటూ క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయకుండా పింఛన్ల తొలగింపు నిర్ణయాలు చేయడం సరికాదు. వికలాంగుల పింఛన్లు పనరుద్ధరణ కోసం బాధితుల పక్షాన సిపిఎం పోరాటం చేస్తుంది.

ఫిరంగి ప్రవీణ్‌కుమార్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు.

ఇప్పుడెలా అనర్హుడిని అయ్యాను..

నిరుపేద కుటుంబానికి చెందిన నేను 2011 సంవత్సరం నుంచి వికలాంగుల పింఛన్ తీసుకుంటున్నాను. అప్పుడు అర్హత ఉండే నాకు ఇప్పుడు అనర్హుడునెలా అయ్యాను. నా కాలు సరిగా లేకపోవడం వల్ల నేను ఏ పనీ చేయలేను. అటువంటి నాకు ఇప్పుడు అధికారుల నుంచి నోటీసు అందింది. నాకు పింఛన్ ఇప్పుడు నిలిపేశారు. నడవలేని నేను ఆఫీసుల చుట్టూ తిరగలేను. అధికారులు స్పందించి నా పింఛన్‌ను పునరుద్ధరించాలి.

వి.వెంకటేష్, మధురేపల్లి గ్రామం, చిలమత్తూరు మండలం.

ఉన్నఫలంగా పింఛన్ తొలగించారు

2012లో నాకు పింఛన్ మంజూరు అయ్యింది. అప్పుడు రూ.200 ఇచ్చే వాళ్లు. గత నెల వరకూ పింఛన్ వచ్చింది. ఇప్పుడు వైకల్యం 40 శాతం కంటే తక్కువ ఉందంటూ పింఛన్ తొలగించామని సచివాలయ అధికారులు చెబుతున్నారు. నాకు ప్రభుత్వం 89 శాతం వైకల్యం ఉన్నట్టు సర్టిఫికెట్ ఇచ్చారు. ఇప్పుడు 40 శాతం కంటే తక్కువ ఉందంటున్నారు. కనీసం నడవలేని స్థితిలో ఉన్న తనపై ప్రభుత్వం దయా చూపించాలి.

కళావతి, కల్లుకుంట, చిలమత్తూరు మండలం.

తొలగింపు నోటీసులతో ధర్మవరం ఎంపిడిఒ కార్యాలయం వద్ద వికలాంగుల నిరసన

అర్హులైన వికలాంగులకు పింఛను మంజూరు చేయాలి

సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

రీవెరిఫికేషన్ పేరుతో ధర్మవరం పట్టణం, రూరల్‌లో ఉన్న అర్హులైన వికలాంగుల పింఛను తొలగించారని వీటిని వెంటనే పునరుద్ధరించాలని సిపిఎం, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం స్థానిక ఆర్డీవో మహేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు జెవి రమణ, ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్ హెచ్ భాష మాట్లాడుతూ ధర్మవరం డివిజన్ పరిధిలో అనేకమంది వికలాంగులకు అనర్హులుగా ప్రకటిస్తూ వారికి వస్తున్న పింఛను రద్దు చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. రాజకీయ పార్టీలతో ముడిపెట్టి అర్హులకు అన్యాయం చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తల కదిరప్ప, సిఐటియు నాయకులు ఎల్ ఆదినారాయణ, చేనేత కార్మిక సంఘం నాయకులు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నాణ్యమైన విద్యను అందిద్దాం : కలెక్టర్

ప్రజాశక్తి-గోరంట్ల

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా ఉపాధ్యాయులు, సిబ్బంది అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సూచించారు. మండలంలోని పాలసముద్రం మాదక ద్రవ్యాలు, కస్టమ్స్ మరియు పరోక్ష పన్నుల జాతీయ అకాడమీ(నాసిన్) ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయంలో విద్యాలయ మేనేజ్మెంట్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. 2025 – 26 విద్యా సంవత్సరానికి సంబంధించి బడ్జెట్, అడ్మిషన్లు, సిబ్బంది జీతాలు, స్కూల్ ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి తదితర అంశాలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రతి ఉపాధ్యాయుని ప్రధాన బాధ్యతన్నారు. సెప్టెంబర్ 2న జరగబోయే పరీక్షలకు ముందుగానే పేరెంట్ టీచర్స్ మీట్‌ను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు సమన్వయంతో ముందుకు సాగితేనే నాణ్యమైన విద్య సాధ్యమవుతుందన్నారు. విద్యాలయ శాశ్వత భవన నిర్మాణానికి, సిబ్బంది నియామకానికి తన ద్వారా కేంద్రీయ విద్యాలయ సంఘటన్ కమిషనర్‌కు ఉత్తరం పంపించాలన్నారు. ప్రార్థనా మైదానాన్ని కాంక్రీట్ సిమెంట్ తో ఏర్పాటు చేయాలని, విద్యార్థుల వేచి ఉండడానికి బస్ షెల్టర్, స్పీడ్ బ్రేకర్స్, క్రీడామైదానం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, నాసిన్ డిప్యూటీ డైరెక్టర్ ఈ.శేషు, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ బి.కృష్ణారావు, ఆర్అండ్‌బి ఎస్ఈ సంజీవయ్య, కృష్టప్ప, నాగరాజు, శశికళ, నరసింహులు పాల్గొన్నారు.

విద్యాలయ మేనేజ్మెంట్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

బలవంతపు భూ సేకరణ ఆపండి

◆ కరేడులో అక్రమ అరెస్టులు దుర్మార్గం ◆ సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.ఓబులు

ప్రజాశక్తి-పెనుకొండ

కార్పొరేట్ కంపెనీ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బలవంతపు భూసేకరణను తక్షణం ఆపాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు జి.ఓబులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సివిల్ సప్లై హమాలీ యూనియన్ కార్యాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సి.రామకృష్ణతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. నెల్లూరు జిల్లా కరేడు గ్రామంలో ఇండోసోల్ కార్పొరేట్ కంపెనీ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న కరేడు గ్రామ రైతులు, ప్రజలకు సంఘీభావంగా ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, వివిధ రైతు ప్రజాసంఘాలు సోమవారం చేపట్టిన "ఛలో కరేడు" కార్యక్రమంపై రాష్ట్ర ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. శాంతియుతంగా సభ జరుగకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రజానీకంపై ఉక్కు పాదం మోపిందని ధ్వజమెత్తారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామ సభలు నిర్వహించకుండా 80శాతం ప్రజల ఆమోదం లేకుండా భూసేకరణ చేయరాదని చట్టం చెబుతోందన్నారు. చట్టాలను తుంగలో తొక్కి బలవంతపు భూ సేకరణ చేయడం, రైతులకు అన్యాయం చేయడం శోచనీయమన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సి.రామకృష్ణ మాట్లాడుతూ పచ్చని పొలాలు, సంవత్సరానికి మూడు పంటలు పండే భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పనంగా ధారాదత్తం చేయడం ఏమి అభివృద్ధి అని ప్రశ్నించారు. భూమినే నమ్ముకున్న రైతులను రోడ్డున పడేసే చర్యలను ప్రభుత్వం మానుకోవాలన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో సోలార్, ఏపీఐఐసీ కోసం సుమారు 60వేల ఎకరాలతో పాటు ఎన్‌పి.కుంట, గోరంట్ల, హిందూపురం, మడకశిర, రొద్దం తదితర ప్రాంతాల్లో బలవంతపు భూ సేకరణ చేశారన్నారు. దీనిని వెంటనే అపాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే రైతులను ఐక్యం చేసి బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడుతాం అని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు హరి, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జడ్డీ.శ్రీనివాసులు, ఈఎస్.వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు జిఎల్.నరసింహులు, లక్ష్మి నారాయణ, బాబా, సాంబ, ఉషమ్మ, మండల నాయకులు నాగరాజు, బాబావలి, బావమ్మా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, వెంకట రాముడు పాల్గొన్నారు.

విలేకరులతో సమావేశంలో పాల్గొన్న సిపిఎం, సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు

ప్రభుత్వ అడ్మిషన్లు.. ప్రయివేటుకు మళ్లింపు.!

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు పొట్టి శ్రీరాములు జడ్పీ హై స్కూల్ లో పని చేసే ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి అడ్మిషన్ కోసం వచ్చిన పిల్లలను ప్రయివేటుకు మరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాను ప్రభుత్వం నుండి వేతనం తీసుకుంటూ ప్రయివేటు పాఠశాలలకు పీఅర్వోగా పని చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. మంగళవారం అడ్మిషన్ కోసం వచ్చిన ఓ విద్యార్థిని ఓ ప్రయివేటు పాఠశాల పేరు చెప్పి అక్కడ జాయిన్ అవ్వండి అని వారిని మోటివేషన్ చేయడం దుమారం రేపుతోంది. దీనిపై ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శశికళని వివరణ కోరగా ఎవరైనా అడ్మిషన్ కి వచ్చినప్పుడు జాయిన్ చేసుకుంటామన్నారు.

మార్కెట్ యార్డ్ వైస్‌చైర్ పర్సన్‌కు సన్మానం

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ మార్కెట్ యార్డు వైస్‌ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన శ్రావణి పల్లవరాజును టిడిపి నాయకులు మంగళవారం సన్మానించారు. సోమందేపల్లి టీడీపీ టౌన్ అధ్యక్షులు వడ్డే సూరి, మండల వడ్డెర సంఘం అధ్యక్షులు వడ్డే మోహన్ మంగళవారం గుట్టూరులో ఆమె స్వగృహంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు డీలర్ వడ్డే లక్ష్మీనారాయణ, వడ్డే రమేష్, వడ్డే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బోర్డుపై ప్రయాణం

బస్సుల కొరతతో విద్యార్థులకు తప్పని పాట్లు

ప్రజాశక్తి - తాడిమర్రి

బస్సుల కొరత, అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని చేపట్టిన పాలకులు, అధికారులు అందుకు తగ్గట్టు అదనపు బస్సులు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లడానికి బస్సుల్లో ప్రయాణించే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదపు టంచున ఫుట్‌బోర్డుపై ప్రయాణం సాగిస్తున్నారు. మండలంలోని నిడిగల్లు, పెద్దకోట్ల, చిల్లకొండాయపల్లి గ్రామాల నుంచి దాదాపు 200 మంది విద్యార్థులు మండలకేంద్రంలోని జెడ్పి హైస్కూల్, జూనియర్ కళాశాలకు, ధర్మవరం జూనియర్ కాలేజీకి బస్సులో వెళుతుంటారు. ఈ రూట్లలో 10 బస్సులు తిరుగుతున్నప్పటికీ విద్యార్థులు వెళ్లే సమయానికి ఒకే ఒక్క బస్సు సర్వీసు మాత్రమే ఉంది. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లడానికి, రావటానికి ఉన్న బస్సులో అధిక రద్దీ ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ సమయంలో ఆర్టీసీ అధికారులు మరిన్ని బస్సు సర్వీసులను నడిపితే విద్యార్థుల ఇబ్బందులు తొలగించవచ్చు. అయితే వారు ఆదిశగా చర్యలు తీసుకోకపోవటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైగా ఆర్టీసీ సిబ్బంది కూడా విద్యార్థులపై దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించిన ప్రభుత్వం బస్సు సర్వీసులను పెంచకపోవటం వల్లనే విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి విద్యార్థులకు ప్రమాదకరమైన ప్రయాణం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

కిక్కిరిసిన బస్సులో ఎక్కడానికి ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

దాయాదుల భూ సమస్య

విఆర్ఎ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - నల్లచెరువు

దాయాదుల మధ్య నెలకొన్న భూతగదా విషయంలో తనకు అన్యాయం జరిగిందన్న కారణంతో మండలంలోని ఓరువాయి గ్రామానికి చెందిన విఆర్ఎ రంగస్వామి స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన బంధువులు రంగస్వామిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు.. ఓరు వాయి గ్రామానికి చెందిన రంగస్వామి, కృష్ణయ్య, వెంకటరమణ, చిన్న రెడ్డప్ప చిన్నాన్న పెదనాన్న బిడ్డలు. వీరికి పిత్రాజితంగా వచ్చిన భూమిపై తగదా జరుగుతోంది. ఈ భూమి విషయంపై చిన్నరెడ్డప్ప జిల్లా కలెక్టర్‌కు గతంలో ఫిర్యాదు చేశాడు. స్పందించిన కలెక్టర్ విచారణ చేయాలని తహశీల్దార్‌కు ఆదేశించారు. సర్వే నెంబర్ 397 ఒకటో లెటర్ 1.40 ఎకరాలు, 397 రెండో లెటర్‌లో 2 .20 ఎకరాలు ఉండగా చిన్న రెడ్డప్ప 20 సెంట్లు భూమిలో తమలపాకుల తోట సాగు చేసుకున్నాడు. అయితే ఆ భూమి తనకు సంబంధించింది అని వీఆర్ఏ రంగస్వామి చెబుతున్నారు. ఈ విషయమై అనేకమార్లు లాయర్ల దగ్గరికి వెళ్లారు. ఈ భూతగదా సివిల్ కోర్టులో నడుస్తోంది. ఈనేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన అధికారులు 19 సెంట్ల భూమి చిన్నరెడ్డప్పకు చెందినది అని నిర్ధారించారు. అందుకు సంబంధించి 19 సెంట్ల భూమిని చిన్నరెడ్డప్ప పేరుమీద ఎక్కించారు. ఇది తెలిసిన విఆర్ఎ రంగస్వామి మనస్థాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇదిలా ఉండగా సివిల్ కోర్టులో ఈ భూసమస్య ఉండగా రెవెన్యూ అధికారులు ఏ విధంగా పట్టాదారు పాసుపుస్తకంలో ఎక్కిస్తారని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

సచివాలయాల తనిఖీ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - తాడిమర్రి

మండలకేంద్రంలోని 1,2 సచివాలయాలను డిడిఒ జనార్ధనరావు, ఎంపిడిఒ రంగారావు మంగళవారం తనిఖీ చేశారు. 'సమయపాలన పాటించని అధికారులు' శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు డిడిఒ, ఎంపిడితతో పాటు డిప్యూటీ ఎంపిడిఒ విజయశేఖర్‌నాయుడు తదితరులు మంగళవారం మండలకేంద్రంలోని 1,2 సచివాలయాలతో పాటు కునుకుంట సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయాల నిర్వహణ, సిబ్బంది నిర్వహించాల్సిన రికార్డులు, పనితీరుపై దిశా నిర్దేశం చేశారు.

రెడ్డిపల్లిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో అధికారులు పారుశుధ్య పనులు చేపట్టారు. 15రోజులుగా కురుస్తున్న చిత్తడి వర్షం వలన మండలంలోని సుమారు అన్ని గ్రామాలలో కూడా మురుగు నీరు, బురద నీరు రోడ్లపై నిలిచాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రెడ్డిపల్లిలో ఈ ఓ ఆర్ డీ గోవిందప్ప ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు.

ఎపి ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు గడువు పెంపు

ప్రజాశక్తి- కొత్తచెరువు

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం 2025 - 26 విద్యా సంవత్సరానికి గాను పదవ తరగతి, ఇంటర్మీడియట్ తరగతులలో అడ్మిషన్లు పొందడానికి గతంలో నోటిఫికేషన్ జారీ చేశారని డిఇఒ కిష్టప్ప తెలిపారు. రూ.200 అపరాధ రుసుంతో సెప్టెంబర్ 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పదవ తరగతిలో చేరుటకు 14 సంవత్సరాలు, ఇంటర్మీడియట్లో చేరుటకు 15 సంవత్సరాలు పూర్తి అయి ఉండాలన్నారు.

మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి-సోమందేపల్లి

మార్కెట్‌యార్డ్ డైరక్టర్‌గా ఎన్నికైన మండల కేంద్రానికి చెందిన రంగన గోపాల్‌ను మంగళవారం సన్మానించారు. మండల కేంద్రానికి చెందిన ముస్లిం సోదరులు ఆయన స్వగృహంలో పూలమాలలు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జామియా మసీద్ కార్యదర్శులు కుల్లాయప్ప, అక్రమ్ భాష, బంగారు షాపు యజమాని షాషా, ఆన్సర్ బాష, తొగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షులు సిసి హరిదాస్, ముస్లిం మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు అందజేయాలి

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని పారిశుధ్య కార్మికుల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ యూనియన్ నాయకులు అక్కులప్ప, బాలకృష్ణ, నరసింహులు, కదిరప్ప, ఆంజనేయులు తదితరులు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. తమ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి పారిశుధ్య కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

సబ్సిడీతో పశువుల దాణా

ప్రజాశక్తి బత్తలపల్లి

మండలంలోని పాడి రైతులకు 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వం పశువుల దాణాను అందజేస్తుందనిబత్తలపల్లి ప్రాంతీయ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి తెలిపారు పశు సంవర్ధక శాఖ ద్వారా రూ. 1110ల విలువైన 55 కేజీల పశువుల దాణా 50 శాతం రాయితీతో రూ. 555లకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మంగళవారం అప్పరాచెరువు స్టాక్ పాయింట్ నుండి ముందుగా చెల్లించిన మండలంలోని 200 మంది డి. చెర్లోపల్లి పరిధిలోని పాడి రైతులకు రెండు బ్యాగుల చొప్పున పంపిణీ చేశారు.

హాస్టళ్లలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - బుక్కపట్నం

విద్యార్థులకు హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించాలని బీసీ వెల్ఫేర్ అధికారి రాజేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం వెనుకబడిన విద్యార్థుల సంక్షేమం కోసం హాస్టళ్లను ప్రవేశపెట్టి విద్యార్థులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని వివరించారు. కొత్తగా చేరిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం కాలేజీ పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, పిడి రామకృష్ణ, అధ్యాపకులు నీలిమ, అస్లం, హాస్టల్ వార్డెన్ లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీలకు ప్రజాసంఘాల కృతజ్ఞతలు

ప్రజాశక్తి - హిందూపురం

యశ్వంత్ పురం నుండి కాచిగూడ వెళ్లే వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలు హిందూపురం రైల్వే స్టేషన్ లో ఆగడానికి కృషి చేసిన హిందూపురం, అనంతపురం పార్లమెంట్ సభ్యులు బికే. పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణలకు హిందూపురం ప్రజాసంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ ఉదయ్ కుమార్, సామాజిక కార్యకర్త ఉమర్ ఫరూక్, రైతు సంఘం నాయకులు ధనాపురం వెంకట్రామిరెడ్డి, మాజీ కౌన్సిలర్ దాదా పీర్, జనవిజ్ఞాన వేదిక నాయకులు అతావుల్లా, బీఎస్పీ శ్రీరాములు,నాగార్జున, వాల్మీకి సంఘం నాయకులు లోకేష్, డి.ఆర్.జి . శ్రీనివాసులు, ఆర్.సి.పి నాయకులు ఏ.శ్రీనివాసులు మాట్లాడుతూ వందే భారత్ రైలు హిందూపురం రైల్వే స్టేషన్‌లో ఆగడం వల్ల ఈ ప్రాంత ప్రయాణికులకు హైదరాబాద్ కు వెళ్లేందుకు ఎంతో ప్రయోజనంగా ఉంటుందన్నారు. ఇందుకోసం కృషిచేసిన ఎంపీలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే విజయవాడకు వెళ్లే కొండవీడు ఎక్స్ ప్రెస్ ను కూడా ప్రతిరోజు తిరిగే విధంగా రైల్వే ఉన్నతాధికారులకు విన్నవించాలని కోరారు. దీనివల్ల ఎంతోమంది విద్యార్థులకు, తల్లిదండ్రులకు ప్రయోజనంగా ఉంటుందన్నారు. ప్రతిరోజు విజయవాడకు వెళ్లడానికి ప్రశాంతి ఎక్స్ ప్రెస్ మాత్రమే ఉందని, కొండవీడును కూడా ప్రతిరోజూ విజయవాడకు వెళ్లే విధంగా పార్లమెంట్ సభ్యులు రైల్వే ఉన్నతాధికారుల తో చర్చించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది

ఉదయం 11 గంటలైనా తెరుచుకోని సచివాలయం తలుపులు

ప్రజాశక్తి - అమడగూరు

మండల కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని, సమయానికి సచివాలయం తలుపులు తెరవడం లేదని ప్రజలు వాపోతున్నారు. సచివాలయం తహాశీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాల సమీపంలోఉందని ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉంటుందన్న ఆలోచన కూడా లేకుండా సచివాలయ ఉద్యోగులు వ్యవరిస్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు వేళకు హాజరు కావడం లేదని గతంలో కూడా మండల స్థాయి అధికారులు సచివాలయాన్ని తనిఖీ చేసి సిబ్బంది పనితీరు, సమయపాలనా తీరుపై మండిపడిన సందర్భాలు ఉన్నాయి. మంగళవారం ఉదయం 11గంటలు కావస్తున్న సచివాలయానికి తలుపులు తీయలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని డిప్యూటీ ఎంపీడీఓ రాజశేఖర్ తెలిపారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం విధించిన సమయాలను పాటిస్తూ సక్రమంగా సేవలు అందించాలన్నారు. సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శి మమత డిజిటల్ అసిస్టెంట్ అశోక్ ప్రభుత్వం సూచించిన మేరకు స్వమిత్వ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే పనిలో పెరంవాండ్ల పల్లికి వెళ్లినట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి టోర్నీకి హరీష్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ పరిధిలోని ఎరుకలవాండ్ల పల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ ఎం.ఎస్. కిరణ్ తెలిపారు. సోమవారం గుంతకల్లులోని మంటోస్సోరి పాఠశాలలో ఉమ్మడి అనంతపురం జిల్లా యోగా క్రీడాకారుల ఎంపిక జరిగినట్లు ఆయన తెలిపారు. ఈ ఎంపికలో తమ పాఠశాల నుండి 18 మంది క్రీడాకారులు పాల్గొనగా, వారిలో 8వ తరగతి చదువుతున్న ఆశ్రిత, 9వ తరగతి చదువుతున్న సి. రేవంత్, ఎస్. భాను ప్రసాద్ నాయుడు, ఎస్. గోవర్ధన్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి టోర్నీకి ఎన్నికయ్యారని వివరించారు. సెప్టెంబర్ 5 నుండి 7వ తేదీ వరకు తాడేపల్లిగూడెం, ద్వారక, తిరుమలలో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీలలో వీరు పాల్గొంటారని చెప్పారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటుచేసి ఎంపికైన క్రీడాకారులను ప్రిన్సిపల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. యోగా శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఖాదర్ వలీ, ప్రసన్న కుమార్ లకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థులతో పాఠశాల ప్రతినిధులు

సమస్యలు పరిష్కరించలేని సమావేశాలెందుకు..?

మండలమీట్‌లో సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి - కొత్తచెరువు

సమస్యలు పరిష్కరించలేని మండల సర్వసభ్య సమావేశం ఎందుకని మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వైస్ ఎంపీపీలు సరళ, గంగరాజు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేశాపురం సర్పంచి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావలసి ఉండగా కొందరు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కాలేదని తమ ప్రశ్నలకు సమాధానం చెప్పేవారు లేరని మండిపడ్డారు. గ్రామపంచాయతీలో నిధులు లేనందున పంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటే ఇబ్బందులు పడుతున్నామన్నారు. తక్షణమే నిధులను ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. ఎంపీటీసీలకు గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. మండలవ్యాప్తంగా వికలాంగుల పింఛన్లు అధికంగా తొలగించారని. అర్హులైన వారికి తిరిగి పింఛను ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

అధికారిని ప్రశ్నిస్తున్న సభ్యుడు

లాటరీ పద్ధతిలో బార్లకు అనుమతి

ఎక్సైజ్ సిఐ లక్ష్మీదుర్గయ్య

ప్రజాశక్తి - హిందూపురం

నూతన బార్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు హిందూపురం ఎక్సైజ్, ప్రొహిబిషన్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయన వెల్లడించారు. హిందూపురం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల హిందూపురం మున్సిపాలిటీ, అలాగే దాని పరిధి దాటి సుమారు 03 కిలోమీటర్ల వరకు మొత్తం 4 నూతన బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అందులో ఒక బార్ గీతా కార్మికుల కులాలకు కేటాయించగా మూడు బార్లను జనరల్ వర్గాలకు కేటాయించినట్లు తెలిపారు. అందులో 50 వేల జనాభా కంటే అధిక జనాభా ఉన్న హిందూపురం ప్రాంతాలలో రూ.55 లక్షలుగా ప్రభుత్వ ధర నిర్ణయించగా ఒక్కొక్క బార్ కు నాలుగు దరఖాస్తులు, ఒక్కొక్కొ దరఖాస్తు రూ.5 లక్షలుగా నిర్ధారించినట్టు చెప్పారు. ప్రస్తుత కొత్త బార్ల పాలసీ ప్రకారం రూ.55 లక్షలుగా ఉందని తెలిపారు. బార్ల కొత్త పాలసీ ప్రకారం బార్లను వేలం పద్ధతిలా కాకుండా, లాట్ల డ్రా పద్ధతిన కేటాయించడం జరుగుతుందన్నారు. గతంలోని బార్ పాలసీ సమయంలో జనాభా స్లాబ్‌ను బట్టి దరఖాస్తు రుసుము రూ.5 లక్షలు, రూ.7.5 లక్షలు, రూ.10 లక్షలుగా నిర్ణయించగా కొత్త విధానంలో బార్‌లకు రూ.5 లక్షల ఏకరీతి అప్లికేషన్ ఫీజుతో పాటు రూ.10 వేల ప్రాసెసింగ్ ఫీజును మాత్రమే అమలు చేస్తున్నట్టు తెలిపారు. కొత్త బార్ లైసెన్స్ ఫీజులు గతంలోని బార్ల అధిక వేలం బిడ్‌ల కంటే చాలా తక్కువగా ఉంటాయన్నారు. నూతన బార్ వ్యాపార సమయం ఉదయం 10 గంటల నుండి అర్ధరాత్రి 12 గంటల వరకు (14 గంటలు) పని వేళలు, అదనంగా 3 గంటల వ్యాపార సమయంగా ఉంటుందన్నారు. పాత బార్ వ్యాపార వేళలు ఉదయం 11 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు మాత్రమే ఉండేదన్నారు. గతంలో బార్ల మొత్తం లైసెన్స్ ఫీజు ఒకే వాయిదాలో చెల్లించాల్సిఉండగా ప్రస్తుత ఫీజు ఆరు వాయిదాలలో చెల్లించవచ్చని సిఐ తెలిపారు. బార్ - అదనపు రిటైల్ ఎక్సైజ్ పన్ను గతంలో మద్యం కొనుగోలు సమయంలో మద్యం డిపో నందు చెల్లించేవారని, ప్రస్తుత మద్యం దుకాణాల మాదిరిగానే అదే ధరకు మద్యం కొనుగోలు చేసి, తరువాత (నిర్దిష్ట గడువు తేదీ నాటికి) బ్యాంక్ గ్యారెంటీతో చెల్లించే ఆర్థిక వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. అలాగే బార్ల లైసెన్స్ పొందిన 15 రోజుల్లోపు లైసెన్స్ దారులు రెస్టారెంట్ ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంలో ఈనెల 28వ తేదీన లాటరీ పద్ధతి ద్వారా బార్లను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఆన్ లైన్ దరఖాస్తులను పుట్టపర్తి ఎక్సైజ్, ప్రొఫెషన్ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందని సిఐ లక్ష్మీ దుర్గయ్య వివరించారు.

మహిళాభివృద్ధితోనే సమాజాభివృద్ధి

ప్రజాశక్తి - గుడిబండ

మహిళాభివృద్ధితోనే సమాజాభివృద్ధి సాధ్యమని కేంద్ర ప్రభుత్వ గ్రామీణ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి టీకే అనిల్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మండలంలోని కరికెర గ్రామంలో మహిళాసంఘ సభ్యులతో సమావేశమయ్యారు. స్త్రీ నిధి. సిఐఎఫ్ బ్యాంకు లింకేజ్ పిఎంఈజీపి సీడ్ క్యాపిటల్ తదితర పథకాల్లో తీసుకున్న రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించిన మహిళలతో మాట్లాడారు. అనంతరం గుడిబండ లోని వెలుగు కార్యాలయంలో మడకశిర నియోజకవర్గంలోని గుడిబండ, మడకశిర, అమరాపురం, రొళ్ల, అగళి మండలాల మహిళా సంఘ సభ్యులు, రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా మండలంలోని మహిళా సంఘ సభ్యులు తాము తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని వారు తయారు చేసిన ఆహార ధాన్యాలు ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం ఆర్థిక మన డబ్బులు,మన లెక్కల యాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించిన మహిళా సంఘాలకు మంజూరైన రూ. 618. 53 కోట్లు చెక్కును మహిళా సంఘ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఈఓ వాకాటి అరుణ, అడిషనల్ సీఈవో రామానాయుడు, డిఆర్‌డిఏ పీడీ నరసయ్య, వెలుగు ఏపీ నాగరాజు, ఐదు మండలాల ఎపిఎంలు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కమలమ్మ, కార్యదర్శి భాగ్యమ్మ, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

ప్రజాశక్తి - హిందూపురం

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి ఎస్.చెన్నకేశవ ప్రసాద్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. ప్రతి తరగతికి వెళ్లి విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపల్ అనూరాధ అధ్యక్షతన అధ్యాపకులతో సమావేశాన్ని నిర్వహించి సూచనలు చేశారు. అధ్యాపకులందరూ తప్పనిసరిగా ముఖ ఆధారిత యాప్ ను అనుసరించాలన్నారు. సెలవులను కూడా అదే యాప్‌లోనే నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు మంచి విద్యాబోధన అందించాలన్నారు. విద్యార్థులు ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులు అయ్యేలా కృషి చేయాలన్నారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న అధికారి

కార్యదర్శుల పనిఒత్తిడిపై వినతి

ప్రజాశక్తి - రొద్దం

తాము తీవ్ర పనిఒత్తిడి ఎదుర్కొంటున్నామని తమ సమస్యలకు పరిష్కారం చూపాలని మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఎంపిడిఒ రాంకుమార్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఐవిఆర్ఎస్ కాల్స్‌పై పనిచేసే సమయంలో వీడియో కాల్స్ ని తొలగించాలని కోరారు. సెలవు రోజులు, పండుగ సెలవులు , ఇతర రోజుల్లో వివిధ సర్వేల పేరుతో పనిచేయడంతో పలు రకాల అనారోగ్యానికి గురవుతున్నట్లు వాపోయారు. గ్రామపంచాయతీలో పారిశుధ్య కార్యక్రమాల పనితీరును ఐవిఆర్ఎస్ కాల్స్ ఆధారంగా నిర్ధారించడం సరికాదన్నారు. ఆ కాల్స్ ఆధారంగా సరైన పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించలేదని, సానుకూల ఫలితాలు రాలేదని చెబుతు అందుకు పంచాయతీ కార్యదర్శులను బాధ్యులు చేయడం భావ్యం కాదన్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పథకం అమలులో క్షేత్రస్థాయిలో అనేక సమస్యలతో పాటు తగిన సిబ్బంది లేకపోయినా, సాంకేతిక సహకారం లేకున్నా, ఆర్థిక సహకారం లేకున్నా, నిర్ణీత కాలవ్యవధిలో ఈ పథకం ద్వారా సర్వే పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఒత్తిడికి గురి చేయడం భావ్యం కాదన్నారు. తీవ్ర పనిఒత్తిడితో పంచాయతీ కార్యదర్శులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. స్వేచ్ఛాయూత వాతావరణంలో కార్యదర్శులు పని చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు గోవిందప్ప, బాబు, కష్ణమూర్తి, రమేష్, మనోజ్, జనార్ధన్, భక్తవత్సల, వినయ్ కుమార్, లక్ష్మీనారాయణ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామ కార్యదర్శులు

ఫొటోగ్రాఫర్లను అన్ని విధాలా ఆదుకోవాలి

ప్రజాశక్తి - హిందూపురం

వివిధ కార్యక్రమాల్లో ఫొటోలు తీసి వాటి ద్వారా జీవనోపాధి పొందుతున్న ఫొటో, వీడియో గ్రాఫర్లను అన్ని విధాలా ఆదుకోవాలని ఆ సంఘం నాయకులు కోరారు. మంగళవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని హిందూపురం ఫొటో, వీడియో మిక్సింగ్ యూనిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు తెలుగు తల్లి విగ్రహానికి డీఎస్పీ మహేష్ పూలమాలలు వేసి ర్యాలీని ప్రారంభించారు. అసోసియేషన్ అధ్యక్షులు చంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్ ల ఆధ్వర్యంలో అక్కడి నుండి ప్రారంభమైన ర్యాలీ పట్టణ పురవీధుల గుండా కొనసాగింది. ఈసందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఎన్నో వ్యయప్రాయాసాలకు ఓర్చి జీవనోపాధి సాగిస్తున్నామని, ప్రభుత్వం తమ కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఫొటో, వీడియో గ్రాఫర్లకు ఇంటి పట్టాలు మంజూరు చేయడంతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అలాగే ప్రభుత్వ సబ్సిడీ పథకాల వర్తింపులో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నాగరాజు, శ్రీనివాసులు, గంగారాం, గంగాధర్, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుతల్లి విగ్రహం వద్ద ఫొటోగ్రాఫర్లు

రాష్ట్రస్థాయి పోటీల్లో బుక్కపట్నం క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి - బుక్కపట్నం

రాష్ట్రస్థాయి ఫ్లోర్ బాల్ పోటీలలో బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శనతో తమ సత్తా చాటారు. ఈనెల మూడవ తేదీన నరసరావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 19, అండర్ 14 విభాగంలో సత్యసాయి జిల్లా జట్టు నాలుగో స్థానంలో నిలువగా జిల్లా జట్టులో పాల్గొన్న బుక్కపట్నం క్రీడాకారులు తమ సత్తా చాటి ప్రశంసా పత్రాలు అందుకున్నారు, ఉత్తమ ప్రదర్శన చేసిన అండర్ 14 విద్యార్థులు ఆయాన్ సాయి, సందీప్, సమీర్, వెంకట సాయిని, అండర్ 19 విభాగంలో నరేంద్ర, విష్ణు, విగ్నేష్‌ను మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగదీష్ , పిడి రామకృష్ణ, ఫ్లోర్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పూల ప్రసాద్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలానికి చెందిన పలువురు బాధితులకు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళశారం పంపిణీ చేశారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి మనోహర్ ఆధ్వర్యంలో బాధితులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని సిద్దన్నగారిపల్లి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సిపి రేవు గ్రామానికి చెందిన నందకిషోర్ (14) మృతిచెందాడు. నందకిషోర్ తన సెల్ రిపేరీ కోసం మంగళవారం ఉదయం స్నేహితులతో కలిసి ముదిగుబ్బకు వచ్చాడు. అనంతరం ఆటోలో తన గ్రామానికి వెళు తుండగా సిద్దన్నగారి పల్లి వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నందకిషోర్ తీవ్ర గాయపడ్డాడు. క్షతగాత్రుడిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ నాగభూషణ తెలిపారు.

గొర్రెల ఆటో బోల్తా

ప్రజాశక్తి - నల్లచెరువు

మండల కేంద్రంలోని 42వ జాతీయ రహదారిలో సంతతోపు సమీపం వద్ద మదనపల్లి వైపు వెళుతున్న గొర్రెల వ్యానును వెనుకనుండి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో గొర్రెలవ్యాను బోల్తా పడటంతో గొర్రెల యజమాని నజీర్ కు తీవ్ర గాయలయ్యాయి. క్షతగాత్రుడిని108 వాహనంలో తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మదనపల్లికి తరలించారు. ఘటనాస్థలాన్ని పోలీసులు సందర్శించారు.

నిందితులపై హత్యాయత్నం కేసు : సిఐ

ప్రజాశక్తి - కదిరి అర్బన్

పట్టణంలోని ఖాద్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థాన సమీపంలో నివాసమున్న సాయి కిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శివ, పవన్, సాయి కిరణ్, కళ్యాణ్ అలియాస్ (చోరా) లపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సిఐ నారాయణరెడ్డి తెలిపారు. గతంలో నెలకొన్న మనస్పర్ధలతో సాయి కిషోర్‌ను మోటార్ సైకిల్ లో ఎక్కించుకొని చంపే ఉద్దేశముతో వారి ఇంటి వద్దకు తీసుకొని వెళ్లి కట్టెలతో దాడి చేసినట్లు బాధితులు ఫిర్యాదులో తెలిపినట్లు సిఐ చెప్పారు. ఈ దాడికి పాల్పడిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనలో నిందితులుగా ఉన్న నలుగురిలో శివ, పవన్‌పై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసులు ఉండటంతో గతంలో వారిపై రౌడీ షీట్స్ నమోదు చేసినట్లు వెల్లడించారు.ఈ మధ్య నిందితులు పలు గొడవలలో పాల్గొంటూ ఉండడంతో వారికి పలు మార్లు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. ఈ ఫిర్యాదు విషయములో వారి పైన విచారణ చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కల్లూరులో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలోని కల్లూరు గ్రామం లో మంగళవారం స్థానిక ఎస్ఐ నరేంద్ర ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం లోని పాత నేరస్తుల ఇళ్లను తనిఖీ చేశారు. అలాగే అనుమానితుల ఇళ్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ జనార్దన్, ఎఎస్ఐ సర్ఫుద్దీన్, నారాయణ స్వామి, సిబ్బంది వెంకటరాముడు, జనార్దన్, చెన్నకేశవ లు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై దాడి... కేసు నమోదు..

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల పరిధిలోని అప్పలవాండ్లపల్లిలో వృద్ధురాలిపై జరిగిన దాడి ఘటనలో కేసు నమోదు చేసినట్లు సిఐ మారుతి శంకర్ తెలిపారు. గ్రామానికి చెందిన తిప్పేబాయ్ అనే వృద్ధురాలు ఎదురింటి వారితో గొడవ పడడంతో శాంతిబాయ్ ఆమె కుమారుడు వెంకటేష్ నాయక్ చేతి కర్రతో వృద్ధురాలిపై దాడి చేయడంతో తలకు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు విచారణ నిర్వహించి కేసు నమోదు చేశామని సిఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - గుడిబండ

మండలంలోని పిసిగిరి బైరేపల్లి గ్రామాల మధ్యలో ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. కర్నాటక ప్రాంతం లింగదహళ్లి వయా వస్కర వెళ్లే బస్సుకు మంగళవారం మధ్యాహ్నం బైరేపల్లి పిసిగిరి మధ్యలో వెనుక చక్రాలు ఊడి పోయాయి దీంతో అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే బస్సు ఆపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

మేకల మందపై చిరుత దాడి

ప్రజాశక్తి - గుడిబండ

మండలంలోని చిగతూర్పి గ్రామంలో సోమవారం రాత్రి మేకల మందపై చిరుత దాడి చేసింది. ఈ దాడిలో పలు మేకలకు గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన రంగనాథ్ అనే రైతు కు చెందిన మేకల మందపై సోమవారం రాత్రి 12 గంటల సమయంలో చిరుత దాడి చేసింది. అది గమనించిన రైతు రంగనాథ్ గట్టిగా కేకలు వేయడంతో చిరుత సమీపంలోని వంకలోకి వెళ్లిపోయింది. మండలంలో ఈ మధ్య తరచూ మేకలు గొర్రెల మందులపై చిరుతలు వరుసగా దాడులు చేస్తుండడంతో మేకలు గొర్రెలు మృత్యువాత పడుతున్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అటవీ శాఖ అధికారులు స్పందించి చిరుతలను గ్రామాల్లోకి చొరబడకుండా అడవుల్లోకి పంపించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అనారోగ్యంతో టీడీపీ మైనార్టీ సీనియర్ నాయకుడు మృతి

ప్రజాశక్తి-పెనుకొండ

తెలుగుదేశం పార్టీ సీనియర్ మైనార్టీ నాయకులు జఫ్రూలా ఖాన్ అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతిచెందారు. మంగళవారం పట్టణంలోని జఫరుల్లా ఖాన్ ఇంటికి వెళ్లి భౌతికకాయానికి మంత్రి సవిత నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. అదే విధంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత నివాళులర్పించారు. ఈ సందర్భంగా జఫరుల్లా ఖాన్ కు పరిటాల రవితో పాటు తమ కుటుంబంతో ఉన్న అనుబంధం గురించి గుర్తు చేసుకున్నారు..

నివాళి అర్పిస్తున్న మంత్రి సవిత

పుట్టపర్తిని జిల్లా కేంద్రంగా కొనసాగించాలి

ప్రజాశక్తి - బుక్కపట్నం

సత్యసాయి జిల్లా కేంద్రంగా పుట్టపర్తినికొనసాగించాలని వైఎస్ఆర్సిపి మేధావుల జిల్లా ఫోరం అధ్యక్షులు రాచం రెడ్డి భాస్కర్ రెడ్డి కోరారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుట్టపర్తి సత్య సాయి జిల్లా కేంద్రంగా అన్ని నియోజకవర్గాలకు అనువైన ప్రదేశంగా ఉంటూ, ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి సాధిస్తున్న తరుణంలో జిల్లా మార్పుపై ఊహాగానాలు, వదంతులు వ్యాపిస్తున్నాయని అన్నారు. అటువంటి ఆలోచనలను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. వెనుకబడిన ప్రాంతమైన పుట్టపర్తి నియోజకవర్గం అభివద్ధి సాధించాలంటే జిల్లా కేంద్రం మార్పు జరగకుండా పుట్టపర్తి శాసనసభ్యులు పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి చూడాలని కోరారు.

రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన 'సామకోటి'

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను శ్రీ సత్య సాయి జిల్లా టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయం మంగళగిరిలో అధ్యక్షుడిని కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సామకోటి మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని పార్టీ అధ్యక్షులు చెప్పారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాలుగవసారి పదవి చేపట్టి బడుగు బలహీన వర్గాలకు అనేక పథకాలు అమలు చేస్తున్నారని ఈ విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించినటుల చెప్పారు.